నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల
5 కరీంనగర్, గురువారం 21 నవంబర్ 2024 RAJANNA SIRCILLA

# కుర్చీలు సగం ఖాళీ

- మంత్రుల ప్రసంగం నుంచే లేచి వెళ్లిన మహిళలు
- సీఎం మాట్లాడుతున్నా అదే తీరు

వేములవాడ, నవంబర్ 20: ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల పేరిట బుధవారం వేములవాడలో సీఎం రేవంత్ రెడ్డి సభ నిర్వహించారు. గుడిచెరువులో ఏర్పాటు చేసిన ఈ సభకు మహిళలను పెద్దసంఖ్యలో తరలించారు. సీఎం రాజన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసి, మధ్యాహ్నం 1.25 గంటలకు సభా స్థలానికి చేరుకున్నారు. దాదాపు గంట 20 నిమిషాలపాటు మంత్రులు ఉపోద్ఘాతాన్ని ప్రదర్శించారు. ఆ తర్వాత రేవంత్ రెడ్డి మరో 37 నిమిషాలు ప్రసంగించారు. అయితే ఎన్నికల ముందు ఆకర్షించే మాటలు మాట్లాడిన ఆయన, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా చేసిన అభివృద్ధి గురించి చెప్పకుండా ఇతరులను విమర్శించడంపైనే ప్రసంగం చేశారు. అప్పటికే సమావేశానికి బలవంతంగా వచ్చిన మహిళలు, ప్రజలు మంత్రుల ప్రసంగాల నుంచే ఒక్కొక్కరిగా బయటకు వెనుదిరిగారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, పోలీసులు సైతం వారిని బెదిరించి కూర్చోబెట్టేందుకు ప్రయత్నించారు. అయినా ఆగకపోగా, సీఎం ప్రసంగం పూర్తికాక ముందే సగం ఖాళీ అయింది. ముందరు మంది కనిపించినా చివరలో మాత్రం కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి.

# సభలో కాలంచెల్లిన ఆహార పదార్థాలు



వేములవాడ సీఎం సభలో అందించిన కాలం చెల్లిన చిప్స్ ప్యాకెట్

వేములవాడ, నవంబర్ 20: సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేములవాడ సభలో మీడియా ప్రతినిధులకు కాలం చెల్లిన ఆహార పదార్థాలను అందించారు. కవరేజీకి వచ్చిన మీడియా మిత్రులకు బిస్కెట్లు, ఆలు చిప్స్, తాగునీటి ప్యాకెట్లను పౌర సంబంధాల అధికారులు అందజేశారు. అయితే ఆలు చిప్స్ 17వ తేదీకే గడువు ముగియగా, సగం వరకు తిన్న మీడియా ప్రతినిధులు కంగారుపడ్డారు. గడువు దాటిన ఆహార పదార్థాలను ఎలా అందిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత ఆహార తనిఖీ అధికారులకు సమాచారం ఇవ్వగా, ఆహార భద్రత అధికారి అనూష్ సిరిసిల్లలోని మణికంఠ ఏజెన్సీలో తనిఖీలు చేశారు. గడువు దాటిన రూ.6,100 విలువైన ఆహార పదార్థాలను సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేశారు.



వేములవాడ గుడిచెరువు వద్ద ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగా ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

## దర్శనం బంద్.. భక్తుల నిరీక్షణ



రాజన్న ఆలయ ప్రధాన ద్వారం గేటు ఎదుట భక్తులు

వేములవాడ, నవంబర్ 20: ముఖ్యమంత్రి రేవంత్ పర్యటనతో రాజన్న భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సీఎం షెడ్యూల్ ఉదయం 10 గంటలకు ఉండగా.. అధికారులు మాత్రం ఉదయం 6గంటల నుంచే భక్తులకు దర్శనాన్ని నిలిపివేశారు. పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకొని ప్రధాన ద్వారం మూసివేశారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు దర్శనానికి అనుమతించకపోవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. ఆలయం ఎదుట నిరీక్షించారు. 'రేవంత్ డౌన్ డౌన్' అంటూ నిరసన తెలిపారు. మరోవైపు అధికారుల ఆదేశాలతో ప్రధానాలయం రహదారి, జాతర గ్రౌండ్, పాత ఆంధ్ర బ్యాంక్ ఏరియాలో షాపులను మూసివేయడంతో భక్తులు కనీసం తాగడానికి నీళ్లు కూడా దొరక్క ఇబ్బంది పడ్డారు.

# వేములవాడలో సీఎం రేవంత్ రెడ్డి

- రాజన్న సన్నిధిలో పూజలు
- ఆలయ అభివృద్ధి పనులకు భూమి పూజ
- గుడిచెరువు వద్ద ప్రజాపాలన ప్రజా విజయోత్సవ సభ



రాజన్న ఆలయంలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు

వేములవాడ, నవంబర్ 20: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం వేములవాడకు వచ్చారు. రాజన్న ఆలయ అభివృద్ధికి ₹76కోట్ల నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయగా, స్వామివారి ధర్మగుండం వద్ద ఈశాన్య ప్రాంతంలో ఆలయ విస్తరణ అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆలయ ఆవరణలో స్వామివారి ఆలయ అభివృద్ధి చాయాచిత్ర ప్రదర్శనను తిలకించారు. అక్కడి నుంచి రాజన్న ఆలయానికి చేరుకోగా, ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం సీఎం కోడెమొక్కు చెల్లించుకుని స్వామివారి అనుబంధ ఆలయాలైన బాల రాజేశ్వర స్వామి, కాలభైరవుడిని దర్శించుకున్నారు. ఆ తర్వాత స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అద్దాల మండపంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, విప్‌లు అడ్లూరి లక్ష్మణ్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, విజయ రమణారావు, మక్కాన్ సింగ్, ఎమ్మెల్సీలు జీవన్ రెడ్డి, బల్మూరి వెంకట్, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదకు దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్ రాజన్న తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం సీఎం గుడిచెరువులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన విజయోత్సవ సభా స్థలానికి చేరుకొని, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత వేదికపై ప్రసంగించి, తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయారు.



సిరిసిల్ల టౌన్: పోలీస్ స్టేషన్ ఎదుట నినదిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# అర్ధరాత్రి నుంచే నిర్బంధం

- సీఎం పర్యటన నేపథ్యంలో ఆంక్షలు
- నిరసనల భయంతో ముందస్తు అరెస్టులు
- అదుపులోకి మాజీ సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నేతలు, వస్త్ర పరిశ్రమ యజమానులు
- ఠాణాలకు తరలింపు.. టూర్ ముగిసేదాకా అక్కడే

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ప్రతిపక్ష నేతలకు శాపంగా మారింది. నిరసనల భయం, ముఖ్యమంత్రిని ఎక్కడ అడ్డుకుంటారోనన్న అనుమానంతో అర్ధరాత్రి నుంచే నిర్బంధకాండ సాగింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రధానంగా సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలో ఎక్కడికక్కడే ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. ముఖ్యమైన బీఆర్‌ఎస్, ఇతర ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను వారి ఇంటి నుంచే బలవంతంగా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నేతన్నలకు శాశ్వత ఉపాధి కల్పించాలని, సంక్షోభం ఉన్న కాటన్ వస్త్ర పరిశ్రమకు చేయూత నివ్వాలని కోరుతున్న వస్త్ర పరిశ్రమ యజమానులను సీఎం ను కలిపిస్తామంటూ స్థానిక కాంగ్రెస్ నేతలు చెప్పారు. వారి మాటలు నమ్మిన పరిశ్రమ యజమానులు వేములవాడకు వెళ్లేందుకు సిద్ధం కాగా, విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే వారిని అదుపులోకి తీసుకుని సిరిసిల్ల స్టేషన్‌కు తరలించారు. అందులో బీజేపీ నేతలు ఆడెపు రవీందర్, గౌడ వాసు, సైజింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌడ సురేశ్‌తో పాటు ఇతర యజమానులందరినీ అరెస్టు చేశారు. పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని నెల రోజులుగా ఆందోళన చేస్తున్న మాజీ సర్పంచుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన అధికార పార్టీ నేతలు మాట మార్చారు. సీఎం సభకు వెళ్లి సమస్యలు మొరపెట్టుకుందామనుకుని సిద్ధమైన మాజీ సర్పంచులను సైతం అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. ఇక విలీన గ్రామాల జేఏసీ నాయకులను సైతం అరెస్టు చేశారు. జిల్లాలోని 13 మండలాలకు చెందిన బీఆర్‌ఎస్, ఇతర పార్టీలు, ఉద్యమ నేతలందరినీ అర్ధరాత్రి నుంచే అదుపులోకి తీసుకున్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, పార్టీ సీనియర్ నాయకుడు బొల్లి రామ్మోహన్, కౌన్సిలర్లు, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి, ఇల్లంతకుంట, చందుర్తి, కోనరావుపేట, వేములవాడ మండలాలే కాకుండా జగిత్యాల జిల్లా కొడిమ్యాల ఇతర మండలాలకు చెందిన ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు, నాయకులు, మాజీ సర్పంచులందరినీ ఉదయం నాలుగు గంటల నుంచే అరెస్టు చేశారు. కనీసం ముఖం కడుక్కోనివ్వకుండా, స్నానం చేయనీవకుండా తీసుకెళ్లి, సీఎం పర్యటన ముగించుకొని జిల్లా సరిహద్దు దాటే దాకా ఇంటికి పంపించలేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనల భయంతో బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఖండించారు. ప్రజాపాలనలో నిరసనలు చేసే స్వేచ్ఛనిస్తామని చెప్పి అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు.

# ఆశలపై నీళ్లు!

## భరోసానివ్వని ముఖ్యమంత్రి పర్యటన

- రాజన్న క్షేత్రంగా రేవంత్ కొడంగల్ జపం
- ఎంతసేపూ విమర్శలకే పరిమితం
- ఆద్యంతం పాత జీవోల ముచ్చట్లే
- కొత్త ప్రతిపాదనల జీవోల ఊసేలేదు
- నిర్వాసితుల ఇండ్లపై స్పష్టత కరువు
- నేతన్నల ఉపాధిపై నిరాశే
- మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల మాటే లేదు
- ఊసేలేని విలీన గ్రామాలకు పంచాయతీ హోదా
- పైగా ముందస్తు అరెస్టులు
- తీవ్ర అసంతృప్తిలో ప్రజలు

### సీఎం మాట్లాడుతుండగానే బయటికి..



వేములవాడ గుడిచెరువు వద్ద ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగానే వెళ్లిపోతున్న మహిళలు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ)/ వేములవాడ : పీసీసీ అధ్యక్షుడి హోదాలో మార్చి 2023లో రాజన్నను దర్శించుకున్న రేవంత్ రెడ్డి, అప్పుడు ఈ ప్రాంతంపై వరాల జల్లు కురిపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వేములవాడను అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని, హామీలన్నీ నెరవేరుస్తామని మాటిచ్చిన ఆయన, సీఎం హోదాలో బుధవారం తొలిసారి రాజన్న క్షేత్రానికి వచ్చారు. అయితే ఈ సారి మళ్లీ పాత పాటే పాడారని, చేసిందేమీ లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. దాదాపు 37 నిమిషాలపాటు ప్రసంగించిన ఆయన, భవిష్యత్‌లో ఉమ్మడి జిల్లాకు ఏమి చేస్తారో చెప్పకుండా ఎంతసేపూ విమర్శలకే పరిమితమయ్యారు. గత ప్రభుత్వం రాజన్న ఆలయాన్ని విస్మరించిందని విమర్శించడానికే సరిపోయారు. ఆలయ అభివృద్ధికి కేవలం ₹76కోట్ల విడుతల వారీ నిధుల జీవోను విడుదల చేసి, పనులకు శంకుస్థాపన చేసి గొప్పలు చెప్పుకోవడాన్ని ప్రజలు విమర్శిస్తున్నారు. అందులో ₹50 కోట్లు 2024-25 ఆర్థిక సంవత్సరంలో వెచ్చించి, మరో ₹26కోట్లను వచ్చే 2025-26 ఆర్థిక సంవత్సరంలో విడుదల చేస్తామని జీవోలో పేర్కొనడంపై 'ఇంతదానికి.. అన్ని గొప్పలా..?' అని మండిపడుతున్నారు. ధర్మగుండం వద్ద ఆలయ విస్తరణ పనులకు భూమి పూజ చేసిన సీఎం, క్షేత్ర అభివృద్ధికి ఎన్ని నిధులు కావాలో..? ఎంత సమయంలో నిర్మిస్తారనే..? విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వకపోవడంపై గుర్రుగా ఉన్నారు.

### కొత్త ప్రతిపాదనల ముచ్చటే లేదు

వేములవాడకు వచ్చే ఒకరోజు ముందు ప్రభుత్వం ఆగమేఘాల మీద విడుదల చేసిన జీవోల ముచ్చట తప్ప, ఆలయానికి సంబంధించి మరే ఇతర అభివృద్ధి పనులపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడలేదు. తొలిసారి వచ్చినందున అనేక వరాలు కురిపిస్తారని ఈ ప్రాంత ప్రజలు ఆశపడ్డా నిరాశే అయింది. గత ప్రభుత్వం చేపట్టినటువంటి రైల్వేలైన్ నిర్మాణంపై స్పష్టత ఇవ్వలేదు. నిర్వాసితుల ముచ్చట మాట్లాడలేదు. బస్టాండ్ కోసం సేకరించాల్సిన స్థలంపై కూడా క్లారిటీ ఇవ్వలేదు. స్థలం తీసుకుంటారా.. లేదా..? గెజిట్ నుంచి తొలగిస్తారా.. లేదా..? అనే అంశంపై వివరణ లేదు. తెలుగుజాతిని గురించి యావత్ ప్రపంచానికి చాటి చెప్పిన సినారె గొప్పతనాన్ని చాటేలా సినారె కళామందిరాన్ని తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఈ అంశాన్ని కూడా కనీసం ఉచ్చరించలేదు. మంజూరు చేసిన జీవోల ముచ్చటే మాట్లాడి కొత్త ప్రతిపాదనల ఊసెత్తకపోవడంపై ప్రజలకు నిరాశే మిగిలింది.

### ఇందిరమ్మ ఇళ్లలోనూ నైరాశ్యమే

మధ్యమానేరు నిర్వాసితులందరికీ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తామని గతంలో హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి మాటతప్పారు. మధ్యమానేరు నిర్వాసితులు 10,600 మంది ఉండగా, తన పర్యటనకు ముందు రోజు ఇండ్లు కట్టుకోని 4,696 మందికి మాత్రమే ఇండ్లు నిర్మిస్తామని జీవోను ఇచ్చి, మిగతావారిని విస్మరించారు. నిర్వాసితులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలనే డిమాండ్ ఊపందుకోగా, ఈ విషయమై సీఎం స్పష్టత ఇవ్వకపోవడంతో నిర్వాసితులు ఆగమవుతున్నారు. ఇంకా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలపై కూడా ఎలాంటి హామీ ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తన నియోజకవర్గం కొడంగల్‌లో భూ సేకరణ విషయం, నిర్వాసితులకు ఉపాధిపై మాట్లాడిన రేవంత్, ఇక్కడి నిర్వాసితులను మర్చిపోవడాన్ని వారు తప్పు పడుతున్నారు. పైగా అక్కడి భూముల పరిహారం పెంచేందుకు ఆదేశాలు ఇచ్చామని చెబుతున్న ఆయన, ఇక్కడ మిగిలిపోయిన నిర్వాసితుల గురించి మాట్లాడకపోవడంపై మండిపడుతున్నారు.

### నేతన్నకు నిరాశే

సీఎం పర్యటన నేపథ్యంలో కొద్దిరోజుల నుంచి కాంగ్రెస్ నేతలు నేతన్నల సంక్షేమం గురించి ఊదరగొట్టారు. ముఖ్యమంత్రి వస్తున్నారని, ఉపాధికి భరోసానిస్తారని గొప్పలు చెప్పారు. ఇందిర మహిళా శక్తి పథకం పేరిట స్వయం సహాయక సంఘాల సభ్యులకు రెండు చొప్పున ఉచితంగా చీరెల పంపిణీ అంటూ రాసిన ఫ్లెక్సీలను సీఎం సభలో పెట్టి మరీ ప్రచారం చేసుకున్నారు. కానీ, రేవంత్‌రెడ్డి మాత్రం నేతన్నల ఉపాధిపై స్పష్టత ఇవ్వకపోవడం నిరాశకు గురి చేసింది. సీఎం ప్రసంగం ముగించే సమయానికి విప్, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి వచ్చి నేతన్నల ఉపాధి గురించి చెప్పాలని గుర్తు చేశారు. అప్పుడు సమైక్య సంఘాల మహిళలకు సంబంధించి కోటీ 30లక్షల చీరెల ఆర్డర్లు ఇచ్చేందుకు నిర్ణయం జరిగిందని చెప్పారే తప్పా, ఎప్పుడు ఇస్తామన్నది? మాత్రం ప్రకటించకపోవడం నేతన్నలను తీవ్ర నిరాశకు గురిచేసింది. సీఎం వస్తాడు.. ఏదో చెపుతాడనుకుని ఆశతో ఎదురుచూసిన నేత కార్మికులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. ఎంతసేపూ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై తిట్ల దండకమే తప్ప సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధిపై మాట్లాడక పోవడంపై అసహనం వ్యక్తం చేశారు. నేతన్నలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, సీఎం భరోసా ఇస్తాడని మంత్రి పొన్నం ప్రభాకర్ తన ఉపన్యాసంలో చెప్పినా.. సీఎం మాత్రం మాటెత్తక పోవడంపై మండిపడుతున్నారు. కాటన్, పాలిస్టర్ చీరెలు ఇస్తామని ఆరు నెలల నుంచి చెబుతూ వస్తున్న కాంగ్రెస్ నేతలు ఎప్పుడు ఇస్తారో సీఎం నోట ఎందుకు చెప్పించలేకపోయారంటూ నిలదీస్తున్నారు. పైగా ప్రభుత్వం కాటన్ పరిశ్రమకు ఆర్డర్లు ఇవ్వాలని కాటన్ యజమానులు, సిరిసిల్ల కాటన్ వస్త్ర పరిశ్రమ జేఏసీ నాయకులను అరెస్ట్ చేయడంపై మండిపడుతున్నారు.

### విలీన పంచాయతీ హోదా ఏది?

బలవంతంగా సిరిసిల్ల మున్సిపాలిటీలో కలిపిన విలీన గ్రామాలకు సీఎం రాక సందర్భంగా నేతలు ఎన్నో ఆశలు కల్పించారు. విలీన గ్రామాలన్నింటికీ తిరిగి పంచాయతీ హోదా కల్పిస్తామంటూ, సీఎం నోట చెప్పిస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు తప్పకుండా నెరవేరుతాయని భరోసా ఇచ్చారు. విలీన గ్రామాలకు విముక్తి అంటూ సోషల్ మీడియాలో తీవ్ర ప్రచారం చేశారు. కానీ, సీఎం నోట విలీన గ్రామాల గురించి చెప్పించలేకపోయారు. పైగా ఆందోళన చేస్తున్న ఆయా గ్రామాల ఐక్యవేదిక నేతల్ని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌లో పెట్టారు. సీఎం వెళ్లేదాక వదలలేదు. తమ గ్రామాలకు పంచాయతీ హోదా కల్పిస్తామని చెప్పిఅరెస్ట్ చేయిస్తారా..? అంటూ ఐక్యవేదిక నాయకులు మండిపడుతున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్నారని, తమకు భరోసా దొరుకుతుందని ఎదురుచూసిన వివిధ వర్గాల ప్రజలకు నిరాశే మిగిలింది. వేములవాడ టూర్‌లో ఎన్నో హామీలు ఇస్తారని కాంగ్రెస్ నేతలు ఊదరగొట్టినా చివరకు ఉత్తదే అయింది. అధికారంలోకి వస్తే వేములవాడను అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని పీసీసీ ప్రెసిడెంట్ హోదాలో మాటిచ్చిన రేవంత్, ముఖ్యమంత్రిగా తొలిసారి రాజన్న క్షేత్రానికి వచ్చి మళ్లీ పాత ముచ్చటే చెప్పడం, పర్యటనకు ఒకరోజు ముందుగా ఇచ్చిన జీవోలపైనే గొప్పలు చెప్పడంపై అసంతృప్తి వ్యక్తమవుతున్నది. కొత్త ప్రతిపాదనల ఊసేలేకపోవడం, మధ్యమానేరు నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్ల విషయమై స్పష్టత ఇవ్వకపోవడం, నేతన్నల ఉపాధికి భరోసా లేకపోవడంపై తీవ్ర అసహనం కనిపించింది. ప్రసంగించినంత సేపూ విమర్శలకే పరిమితం కావడం, పైగా రాజన్న క్షేత్రంలో తన నియోజకవర్గం కొడంగల్ జపం చేయడంపై ప్రజానీకం మండిపడుతున్నది. సీఎం ఈ ప్రాంత అభివృద్ధికి ఏం చేస్తారో చెప్పించకపోవడంపై స్థానిక నేతల వైఫల్యమేనని విమర్శిస్తున్నది.

### మాజీ సర్పంచులపై మాటే లేదు

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచులు రెండు నెలలుగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. సీఎం రాక సందర్భంగా తమ సమస్యలు చెప్పుకోవచ్చని భావించారు. సీఎంతో మాట్లాడించాలని పార్టీ ముఖ్య నేతల్ని వేడుకున్నారు. సీఎం దగ్గర ఆ నేతల మాట పనిచేసిందో లేదో గానీ, మాజీ సర్పంచ్‌లను మాత్రం ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. ఎక్కడ సీఎంను అడ్డుకుంటారోనన్న భయంతో పొద్దుగాల్నే తమను తీసుకెళ్లి ఠాణాలో వేశారంటూ కొందరు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఈవిధంగా నిర్బంధం విధించడం ఎంతవరకు సమంజసమని, సీఎం పర్యటన వల్ల తమకు ఒరిగేందేమిలేదని మండిపడుతున్నారు.

### రాజన్న క్షేత్రంలో కొడంగల్ జపం

రేవంత్ రెడ్డి రాజన్న క్షేత్ర అభివృద్ధి కార్యక్రమాల కోసం వేములవాడకు వచ్చిన రేవంత్ రెడ్డి, వేదికపై సొంత నియోజకవర్గం కొడంగల్ జపమే చేశారని నియోజకవర్గ ప్రజలు మండిపడుతున్నారు. తనను సీఎంను చేసిన తన నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి నలుగురికి ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పడమే తప్పా ఇక్కడి ప్రజల గురించి, నేతన్నల సంక్షేమం గురించి మాట్లాడకపోవడంపై ఆగ్రహిస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చేస్తున్న భూసేకరణను భూతద్దంలో పెట్టి చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, ఇక్కడి ప్రాంత అభివృద్ధిపై మాత్రం ఒక్కమాట కూడా చెప్పకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.

### దేవాదాయ శాఖ మంత్రి గుడి వరకే..

రాష్ట్ర దేవాదాయ శాఖ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ రాజన్నను దర్శించుకునే అంతవరకు సీఎం రేవంత్ రెడ్డితో ఉన్నారు. అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనంతరం ఆమె బహిరంగ సభకు హాజరు కాలేదు. గుడిలో జరిగిన పూజ వరకే ఉండి తిరిగి వెళ్లిపోవడంపై విమర్శలకు తావిచ్చింది. పైగా సభలోనూ దేవాలయ అభివృద్ధిపై సీఎం పూర్తి క్లారిటీ ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

# రేవంత్.. తిట్ల పురాణానికి బ్రాండ్ అంబాసిడర్

- బీఆర్‌ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ధ్వజం

జగిత్యాల రూరల్, నవంబర్ 20: సీఎం రేవంత్ రెడ్డి తిట్ల పురాణానికి బ్రాండ్ అంబాసిడర్ అని, ప్రజలు చీదరించుకునేలా నోటికి ఏదొస్తే అది మాట్లాడుతున్నాడని బీఆర్‌ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఎద్దేవా చేశారు. రేవంత్ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానని మాట్లాడుతున్నాడని, అంతకుముందు మహిళలకు ఇస్తానన్న ₹2500, ఆడబిడ్డల వివాహానికి తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుధవారం జగిత్యాల జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. స్వరాష్ట్ర సాధకుడైన కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టారీతిన మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తా, మాట వినిపించకుండా చేస్తా' అంటూ సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి మాట్లాడడం సరికాదని హితవు పలికారు. మీ దుర్మార్గమైన పాలనను ప్రజలంతా గమనిస్తున్నారని, త్వరలోనే నీ ఆనవాళ్లు లేకుండా చేయడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎల్ రమణ మాట్లాడుతూ, సాగు నీటి కోసం కాళేశ్వరం, తాగు నీటి కోసం మిషన్ భగీరథ లాంటి ప్రాజెక్టులను నిర్మించి, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. రెండు సార్లు బీఆర్‌ఎస్‌కు అవకాశం ఇచ్చిన ప్రజలు ఒకసారి కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే పాలన చేతకాక కేసీఆర్‌ను దూషించడం సరికాదన్నారు. ఇప్పటికైనా దూషణలు మాని సుపరిపాలన చేయాలని, ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని హితవు పలికారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి ఇష్టానుసారం నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, ప్రశ్నించేవాళ్లు ఉండవద్దని ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతి విషయాన్నీ తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో ప్రజల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, కేసీఆర్ అంటేనే సీఎం రేవంత్ వణికిపోతున్నాడని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిననాటి నుంచే బీఆర్‌ఎస్ అధినేతపై ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌ను ప్రజల గుండెల్లోంచి తొలగించడం, ఆనవాళ్లు లేకుండా చేయడం మీ వల్ల కాదు కదా..? మీ జేజమ్మ వల్ల కూడా కాదని హెచ్చరించారు. కేసీఆర్ పోరాడి రాష్ట్రాన్ని సాధించడం వల్లే ఈ రోజు మీరు సీఎం కుర్చీలో కూర్చున్నారనే విషయాన్ని మర్చిపోవద్దన్నారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో అన్ని పార్టీల మద్దతు కూడా గట్టి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌పై సీఎం రేవంత్ వరంగల్ పర్యటనలో అసభ్య పదజాలంతో మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. పరిపాలన అనుభవం లేక రాష్టాన్ని ఆగంపట్టించారని, ఇప్పటికైనా తిట్ల దండకం మాని పరిపాలనపై దృష్టి పెడితే బాగుంటుందని సూచించారు. కార్యక్రమంలో వేములవాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ జడ్పీటీసీలు రాంమోహన్ రావు, కోల్ముల రమణ, నాయకుడు సత్యంరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, చిత్రంలో ఎమ్మెల్సీ రమణ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత